నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, మంగళవారం 24 డిసెంబర్ 2024 YADADRI BHUVANAGIRI

## మైనారిటీ గురుకులాల్లో పోస్టులకు దరఖాస్తులు



నీలగిరి/నల్లగొండ, డిసెంబర్ 23 : జిల్లాలోని మైనారిటీ గురుకులాల్లో పని చేయడానికి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.విజయేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండ బాలుర పాఠశాలలో పీజీటీ-తెలుగు, ఇంగ్లిష్, బయోసైన్స్, టీజీటీ మ్యాథ్స్(జనరల్), నకిరేకల్ బాలికల పాఠశాలలో టీజీటీ సైన్స్(మహిళ), నల్లగొండ బాలుర కళాశాలలో స్టాఫ్ నర్సు(జనరల్), అనుముల బాలుర పాఠశాలలో స్టాఫ్‌నర్సు(జనరల్), నల్లగొండ బాలికల పాఠశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్(మహిళ) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో యాదాద్రి బాలికల జట్టు విజయం



రాష్ట్రస్థాయిలో గెలుపొందిన యాదాద్రి భువనగిరి జిల్లా బాలికల కబడ్డీ జట్టు

ఆలేరు టౌన్, డిసెంబర్ 23 : హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ హాస్టల్‌లో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో యాదాద్రి జిల్లా కబడ్డీ జట్టు ఆసిఫాబాద్ జట్టుతో తలపడి విజయం సాధించింది. ఈ సందర్భంగా క్రీడాకారిణులు, కోచ్ పూల చంద్రకుమార్‌ను తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పూల నాగయ్య సోమవారం అభినందించారు.

# చేనేత పొదుపుపై నీలినీడలు

## ఆగస్టులో ముగిసిన త్రిఫ్ట్ పథకం గడువు

- నాలుగు నెలలవుతున్నా పొడిగింపు ప్రస్తావన కరువు
- నేతన్నల సామాజిక భద్రత కోసం నాడు కేసీఆర్ శ్రీకారం
- రెండు దఫాలుగా 11 వేల కుటుంబాలకు లబ్ధి
- కాంగ్రెస్ సర్కారు తీరుతో ఆందోళనలో నేత కార్మికులు
- ఎట్టిపరిస్థితుల్లోనూ కొనసాగించాలని డిమాండ్



యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : నేత కార్మికులకు ఉన్న ఒక్కగానొక్క చేనేత పొదుపు పథకం కొనసాగుతుందా? కార్మికులకు ఆసరాగా నిలిచే స్కీమ్‌ను కాంగ్రెస్ సర్కారు ఏం చేస్తుంది? అనే సందేహాలతో నేతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. చేనేత కార్మికుల కోసం బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చి సమర్థవంతంగా అమలు చేసిన త్రిఫ్ట్ స్కీమ్‌పై ప్రస్తుతంనీలినీడలు కమ్ముకున్నాయి. పథకం గడువు ముగిసిన నాలుగు నెలలు కావస్తున్నా కొనసాగింపు ఊసు లేకపోవడమే ఇందుకు కారణం.

### పొదుపు పథకానికి కేసీఆర్ శ్రీకారం..

నేతన్నలను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటూ అండగా నిలిచింది. ఉపాధి లేక వలసలు వెళ్లిన కార్మికులకు చేయూతనిచ్చింది. నేతన్నల సామాజిక భద్రత కోసం అప్పటి సీఎం కేసీఆర్ చేనేత పొదుపు పథకానికి శ్రీకారం చుట్టారు. నేత కార్మికుల నెలవారీ ఆదాయంలో 8 శాతం ఆర్‌డీ1లో జమ చేసిన తర్వాత.. ప్రభుత్వం ఆర్‌డీ2లో 15 శాతాన్ని నేరుగా జమ చేసేది. ఆ మొత్తం నగదును వడ్డీ సహా మూడేండ్ల తర్వాత కార్మికులను అందించేది. అంతకుముందు 2018-2021లో ఒక దఫా ఈ విధంగా లబ్ధిదారులు సాయం పొందారు. 2021-2024 సంవత్సరానికి గానూ ఆగస్టు 31న పథకం గడువు ముగిసింది.

### 11వేల కుటుంబాలకు ఆసరా..

2021-2024 సంవత్సరానికి గానూ యాదాద్రి భువనగిరి జిల్లాలో 11 వేల మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డబ్బులు జమ చేయడంలో ఆలస్యం చేసింది. సుమారు 11 నెలల పాటు నెలనెలా డబ్బులు చెల్లించడం నిలిపేసింది. దాంతో రూ.25 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. కార్మికులు మాత్రం తమ వాటాను క్రమం తప్పకుండా కట్టారు. ఆఖరికి పథకం గడువు ముగియడంతో చేనేత వర్గాల నుంచి వ్యతిరేకత రావడంతో చేసేది లేక నిధులు విడుదల చేసింది. దాంతో జిల్లాలో సుమారు 11వేల మంది కార్మికులకు లబ్ధి చేకూరింది. వాటాను బట్టి ఒక్కొక్కరికి 2 లక్షల నుంచి మూడు లక్షల వరకు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి.

### పథకాన్ని కొనసాగించేనా?

ఈ ఏడాది ఆగస్టు నెలలో చేనేత పొదుపు పథకం గడువు ముగిసింది. బీఆర్ఎస్ హయాంలో గడువు ముగియగానే కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం ఇప్పటివరకూ స్పష్టత లేదు. పథకం గడువు ముగిసి నాలుగు నెలలు అవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. తమకు ఎలాంటి ఆదేశాలూ రాలేదని చేనేత, జౌళి శాఖ అధికారులు చెబుతున్నారు. దాంతో నేతన్నలు పథకం ఉంటుందా, లేదా? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

### గతంలో చేనేత మిత్ర బంద్..

నేత కార్మికుల కోసం నాడు కేసీఆర్ చేనేత మిత్ర పథకాన్ని తీసుకొచ్చారు. దీని కింద నేత కార్మికులకు రసాయనాలు, నూలుపై 40శాతం రాయితీ కల్పించారు. కొందరికి అవగాహన లేకపోవడం, సబ్సిడీ పొందే ప్రక్రియ తెలియకపోవడంతో దానిని పొందలేకపోయారు. దీని స్థానంలో మగ్గం మీద పని చేసే ప్రతి కార్మికుడికి నెలనెలా రూ.3వేల ఆర్థిక సాయం చేయాలని భావించారు. నేత కార్మికుల బ్యాంకు ఖాతాలో రూ.3వేల చొప్పున జమ చేశారు. ఇందులో నేత కార్మికుడికి రూ.2వేలు, అనుబంధ కార్మికులకు వెయ్యి ఖాతాల్లో వేశారు. కానీ కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. నెల నెలా ఆర్థిక తోడ్పాటును అందించే పథకాన్ని ప్రశ్నార్థకం చేశారు.

### చేనేత పొదుపు పథకాన్ని కొనసాగించాలి



నేత కార్మికులకు ఎంతో ఉపయోగకరమైన చేనేత పొదుపు పథకాన్ని కొనసాగించాలి. కేసీఆర్ గవర్నమెంట్‌లో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిండ్రు. ఇప్పుడు పథకం గడువు అయిపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చేనేత కార్మికులందరినీ దృష్టిలో పెట్టుకొని పథకాన్ని కొనసాగించాలి.

*-బడుగు సత్యనారాయణ, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి*

### లక్షా 20వేల రూపాయలు వచ్చినయ్



మూడు సంవత్సరాలు పొదుపు పథకం కింద కడితే లక్షా 20 వేలు వచ్చినయి. కాంగ్రెస్ గవర్నమెంట్‌లో ఆ స్కీమ్ గురించే మాట్లాడుతలేరు. మా కుటుంబానికి మగ్గమే ఆధారం. కరోనా సమయంలో కూడా ఎంతో ఆసరా అయ్యింది. నెలనెలా మేం డబ్బులు జమ చేసుకునేది. ఇప్పుడు ఆ స్కీమ్ లేకపోయె. ప్రభుత్వం మా గురించి ఆలోచన చేస్తలేదు. చేనేత కార్మికులకు ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు పెట్టిన పొదుపు పథకాన్ని కొనసాగించాలి.

*-కుడికాల సుదర్శన్, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి*

# యాసంగి షురూ..

## సూర్యాపేట జిల్లాలో 5,02,372 ఎకరాల్లో సాగు అంచనా

- దుక్కులు దున్ని.. నాట్లు వేస్తున్న రైతాంగం
- ప్రభుత్వం పెంచి ఇస్తానన్న రైతు భరోసా ప్రశ్నార్థకం



మద్దిరాలలో దుక్కి దున్నుతున్న రైతు

సూర్యాపేట, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : వానకాలం ధాన్యం విక్రయాలను పూర్తి చేసుకున్న రైతాంగం ఇప్పుడిప్పుడే యాసంగి సీజన్‌కు సిద్ధమవుతున్నది. దుక్కులు దున్నుతూ నాట్లు వేయడం మొదలు పెడుతున్నది. ఈసారి సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 5,02,372 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఆయా పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, ఏడాది క్రితం వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఏటా రెండు సీజన్లకు రైతుబంధు పేరిట ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించేది. కాంగ్రెస్ పాలనలో రైతులకు పెట్టుబడి సాయం అందని ద్రాక్షే అయ్యింది. రైతుభరోసా పేరిట ఎకరాకు రూ.7,500 చొప్పున ఇస్తామని ఇచ్చిన హామీని ఈ యాసంగిలోనైనా అమలు చేస్తారా, లేదా అన్నది రైతన్నలను వేధిస్తున్నది.

పదకొండేండ్ల క్రితం వరకూ సూర్యాపేట జిల్లా పరిధిలోని సగం భూములు పంటలు పండక బీడుపడి కనిపించేవి. కొట్లాడి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో కాళేశ్వరం జలాలు ఇక్కడి భూములను సస్యశ్యామలం చేశాయి. ఎక్కడా లేనివిధంగా తొలిసారి రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రెండు పంటలకు ఎకరా ఒక్కంటికి రూ.5వేల చొప్పున అందిస్తూ రావడం కలిసి వచ్చింది. కాగా, తాము అధికారంలోకి వస్తే రెండు పంటలకు ఎకరా రూ.7,500 చొప్పున ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పటికి రెండు సీజన్లు పూర్తయి మూడో సీజన్ షురూ అయినా నయా పైసా ఇవ్వలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడి సాయం ప్రశ్నార్థకంగా మారగా.. రైతులు అప్పోసొప్పో చేసి యాసంగి సీజన్‌కు సమాయత్తం అవుతున్నారు. కొద్ది రోజులుగా దుక్కులు దున్నుతూ నాట్లు వేస్తున్నారు. ఈసారి జిల్లావ్యాప్తంగా వివిధ రకాల పంటలు కలిపి 5,02,372 ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అత్యధికంగా వరి 4,78,147 ఎకరాల్లో ఉండనున్నట్లు పేర్కొంటున్నారు. ఆ తరువాత ఆయిల్ పామ్ 4,565 ఎకరాలు, వేరుశనగ 866 ఎకరాలు, జొన్న 519, కంది 52, పెసర 450, చెరుకు 273, ఎండు మిర్చి 201, ఇతర పంటలు 1,323 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు చెప్తున్నారు. ఆ మేరకు సబ్సిడీ విత్తనాలతోపాటు యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులను సమకూర్చే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. ఈ సీజన్‌కు సంబంధించి 68,820 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ప్రస్తుతం 19,037 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉంది. డీఏపీ 5,650 మెట్రిక్ టన్నులకు గానూ 1,082, ఎంఓపీ 1,900 మెట్రిక్ టన్నులకు గానూ 745 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 37,250 మెట్రిక్ టన్నులకు గానూ 12,316 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. అదనపు స్టాక్ కోసం ఆయా ఎరువుల కంపెనీలకు ఇండెంట్లు పంపించారు.

### యాసంగి సీజన్‌కు రెడీ



యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తనాలు, ఎరువులను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. తొలి విడుత అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి. ఇప్పటికే అన్ని కంపెనీలకు ఇండెంట్లు పెట్టగా త్వరలోనే జిల్లాకు చేరుకోనున్నాయి.

*– శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి*

## సమగ్ర శిక్ష ఉద్యోగుల వంటావార్పు



రోడ్డుపై భోజనాలు చేస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 23: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న దీక్షల్లో భాగంగా సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు కొనసాగాయి. నల్లగొండలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సూర్యాపేటలో సీఎం, మంత్రుల ఫేస్ మాస్క్‌తో ఉన్న వారి నుంచి భిక్షాటన చేశారు. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేపట్టారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె విరమించేది లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మంగ పాండరి స్పష్టం చేశారు. ప్రభుత్వ స్పందించి సమస్యలు పరిష్కరించాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.



నల్లగొండ తాసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

## డబుల్ బెడ్రూమ్ ఇండ్లను అప్పగించాలని ధర్నా

నల్లగొండ రూరల్, డిసెంబర్ 23 : లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లను అప్పగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బెడ్రూమ్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంతో శిథిలావస్థకు చేరాయన్నారు. లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను గత సర్కారు ఎంపిక చేసిందని, వారికి జనవరి 19 నాటికి ఇండ్లు అందించేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో లబ్ధిదారులకు తామే ఇండ్లను అప్పగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు తాసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు.

అనంతరం డబుల్ బెడ్రూమ్ ఇండ్ల సాధన పోరాట కమిటీ కన్వీనర్‌గా మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్‌తో పాటు 19 మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండపల్లి సత్తయ్య, సయ్యద్ హాషం, ఎండీ సలీం, తుమ్మల పద్మ, నరసింహ, సరోజ, కోట్ల ఆశోక్‌రెడ్డి, నరేశ్, మధుసూదన్‌రెడ్డి, అరుణ, నాగరాజు, మారగోని నగేశ్, అవుట రవీందర్, సుజాత, శ్రీనివాస్, జహంగీర్, గణేశ్, భిక్షపతి పాల్గొన్నారు.



రాయగిరి ప్రభుత్వ పాఠశాలలో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

## మెనూలో నాణ్యత పాటించకుంటే చర్యలు

- కలెక్టర్ హనుమంతరావు
- హెచ్ఎం, ఫుడ్ కమిటీకి నోటీసులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 23 : మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. పట్టణ పరిధిలోని రాయగిరి జడ్పీహెచ్ఎస్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వంట గదిని పరిశీలించి పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజనానికి సరిపడా పప్పు, కూరగాయలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్ఎం, పాఠశాల ఫుడ్ కమిటీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులున్నారు? సరిపడా వంట చేస్తున్నారా? అని తెలుసుకున్నారు. బియ్యం బాగున్నాయా.. అన్నం బాగా అవుతుందా అని ఆరా తీశారు. వంట గదిలో ఎలుకలు తిరుగకుండా బోన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తనిఖీలు జరుగుతూనే ఉంటాయని అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. పెండింగ్ బిల్లుల గురించి హెచ్ఎం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. విద్యాశాఖ అధికారితో మాట్లాడి క్లియర్ చేయించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇంగ్లిష్‌లో ప్రత్యేక తరగతులు బోధించాలని ఆదేశించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## పెద్దగట్టు జాతర ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- అభివృద్ధి నివేదికలు ఇవ్వాలి
- ప్రజావాణిలో 94 దరఖాస్తులు స్వీకరణ : కలెక్టర్

సూర్యాపేట, డిసెంబర్ 23 : ఫిబ్రవరి నెలలో జరుగనున్న లింగమతుల స్వామి జాతరకు ఏర్పాట్లు చేయాలని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. కొన్ని శాఖలు ఇప్పటి వరకు జాతర ఏర్పాట్లపై నివేదిక అందించ లేదని మంగళవారం నాటికి అందించాలని ఆదేశించారు. జాతరలో లోటు పాట్లు లేకుండా అధికారులు చూడాలన్నారు. జిల్లాలో త్వరలోనే డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కేటాయింపు ఉంటుందని, జనవరిలో డ్రా తీయడానికి అధికారులు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి 94 దరఖాస్తులు వచ్చాయని, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, డీఆర్‌డీఓ అప్పారావు, డీటీడీఓ శంకర్, సీపీఓ కిషన్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.




అభినయశ్రీని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

## జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు వెల్లంకి విద్యార్థిని

రామన్నపేట, డిసెంబర్ 23 : జాతీయ స్థాయి రగ్బీ బాల్ అండర్ 17 పోటీలకు వెల్లంకి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని గూని అభినయశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 25 నుంచి 31 వరకు బిహార్ రాజధాని పాట్నాలో జరుగనున్న పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అభినయశ్రీని సోమవారం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పీడీ రేణుక, ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, పారిజాత, యాదగిరి, సీనారెడ్డి, హేమలత, స్వప్న పాల్గొన్నారు.

## నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 23 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు మాట్లాడుతూ నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని విరమించుకోవాలని కిసాన్ మోర్చా అఖిలభారత నాయకుడు జగజీత్ సింగ్ దల్లేవాల్ చేస్తున్న నిరాహార దీక్షను కేంద్ర ప్రభుత్వం విరమింపజేయాలన్నారు. 120 మంది కిసాన్ మోర్చా ఆందోళనకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, నోయిడా లక్సార్ జైలులో నిర్బంధించిన రైతు ఉద్యమ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంటకు కనీస మద్దతు ధర చట్టాన్ని వెంటనే తేవాలని, పంజాబ్ సరిహద్దులో రైతుల పోరాటంపై అణచివేతను ఆపి చర్చలు జరుపాలని కోరారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మామిడాల భిక్షపతి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు జనార్దన్, కేమిడి ఉప్పలయ్య, కొల్లు రాజయ్యగౌడ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కల్లెపు అడవయ్య, అంజిబాబు, జర్కు దయాకర్‌రెడ్డి, పైళ్ల యాదిరెడ్డి, ఏశాల అశోక్, గూడూరు అంజిరెడ్డి, ఆంజనేయులు, రాజయ్య, రేకల శ్రీశైలం, మచ్చ భాస్కర్, తుమ్మల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.